ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 7 జులై 2025 | 5





ముస్లింలకు సంఘీభావంగా మాతం చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



వాడపల్లి వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు



అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకస్వామి



అయినవిల్లి సిద్ధివినాయక ఆలయానికి పోటెత్తిన భక్తులు



అంతర్వేదిలో స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశి పర్వదినం ఆదివారం ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలు భక్తజనంతో పోటెత్తాయి. ఆదివారం సెలవు రోజు కూడా కావడంతో వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధరాష్ట్రాలనుంచి అశేష భక్తజనం తరలివచ్చారు. వేలాదిమంది భక్తులు స్వామి వారి తిరువీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించి భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీ సిద్ధివినాయకస్వామి ఆలయానికి ఆదివారం భక్తులుపోటెత్తారు. తొలిఏకాదశిని పురస్కరించుకుని స్వామికి విశేషపూజలు జరిగాయి.పంచామృతాభిషేకాలు 2, లఘున్యాస అభిషేకాలు 17, అభిషేకాలు 31,గరికపూజ 2, ఉండ్రాళ్లపూజ 17, ప్రత్యేక దర్శనం 888, లక్ష్మీగణపతి హోమం 37,అక్షరాభ్యాసాలు 7, నాలుగుచక్రాల వాహనపూజలు 29, ద్విచక్రవాహనపూజలు 63,కొబ్బరికాయల మొక్కుబడులు 42 నిర్వహించారు.అన్నప్రసాద విరాళం రూ.1,54,390, విరాళం రూ.900, మొత్తం ఆదాయం రూ.4,49,089 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వెంకటదుర్గాభవానీ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కొత్తపల్లి రవిశంకర్ స్వామిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు రూ.58వేలు సమర్పించారు.

అంతర్వేదిలో..

అంతర్వేది,జూలై 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం జరిగే నిత్య అభిషేకం,సుదర్శన హోమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. 6వేలమంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించినట్టు ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. ప్రసాద విక్రయాలు, ప్రత్యేకసేవల ద్వారా రూ.2,74,701, అన్నదాన ట్రస్టుకు విరాళం ద్వారారూ.1,38,928 మొత్తం రూ.4,13,719 ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు.

నిండు శోకంతో మొహర్రం

» సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే గిడ్డి



మామిడికుదురు మండలం నగరంలో రక్తం చిందిస్తూ పీర్లు ఊరేగిస్తున్న ముస్లింలు

మామిడికుదురు,జూలై 6(ఆంధ్రజ్యోతి): కర్బలా పుణ్యభూమిలో అసువులు బాసిన ముస్లిముల ఆరాధ్య దైవం ఇమామ్ హుస్సేన్ అతని72మంది పరివారానికి ముస్లింభక్తులు నిండు శోకంతో రక్త తర్పణం అర్పించారు. నగరం, మామిడికుదురు గ్రామాల్లో ఆదివారం నిండుశోకంతో మొహర్రంను జరుపుకున్నారు. గుండెలు బాదుకుంటూ మాతంనిర్వహిస్తూ భారీ ఊరేగింపు చేశారు. శరీరాన్ని కత్తులు, బ్లేడులతో గాయపరచుకుంటూ ఘన నివాళులర్పించారు. నగరంలోని 36 పంజాల నుంచి పీర్లు గుమ్మటాలు తీసి మాతం నిర్వహిస్తూ పెదపంజీష వరకు ఊరేగింపు చేశారు. అనంతరం పీర్లను తీసుకువెళ్లి నగరం పీర్లచెరువులో శాంతింపచేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంఘీభావంగా మాతం చేసి పీర్లను దర్శించుకుని పూజలు చేశారు.

ఆషాఢం!



ఆఫర్ల వల.. డిస్కౌంట్ల మాయ

» రండి బాబు రండి.. మోసపోండి
» ఆకర్షణీయమైన ప్రకటనలతో బురిడీ
» నాసిరకం.. ప్రముఖ బ్రాండ్లకీ నకిలీ
» జనం ఆశతో కోట్లలో వ్యాపారం

ఆషాఢంలో ఆకర్షణీయమైన ప్రకటనలతో జనాలను బురిడీ కొట్టించే మోళీ మొదలైపోతోంది. నిల్వ సరుకును అంటకట్టడం, నాసిరకంపై రెట్టింపు సొమ్ము లాగేయడానికి దుకాణాలకు ఓ మంచి అవకాశం చిక్కుతోంది. ఓ రూపాయి మిగులుతుందనే అమాయక జనం ఆశను ఆసరాగా చేసుకుని దగా చేయడం పరిపాటిగా మారిపోయింది. ఏకంగా 80 శాతం వరకూ రాయితీ ఇచ్చేస్తున్నారు. గతంలో ఈ మోసం లో కూడా కాస్త నిజాయితీ ఉండేది. రాను రాను మోసం పెరిగిపోయింది.దీంతో ఆ వస్త్రాలు మరో ఆషాఢాన్ని చూడలేకపోతున్నాయి. అయినా 'ఆషాఢం డిస్కౌంట్' మాట చెవిన పడగానే.. జనం ఎగబడడంలో మాత్రం డిస్కౌంట్ ఉండడం లేదు.ఆషాఢం మార్కెట్ మాయపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు ఆషాఢం అంటే వస్త్ర దుకాణాలకు అసలు వ్యాపారం ఉండేది కాదు.. అటువంటిది ఒక్క ఐడియా వ్యాపారాన్నే మార్చేసింది.. జనాలను షాపుల చుట్టూ తిరిగేలా చేస్తుంది.. అదే డిస్కౌంట్..10 నుంచి 90 శాతం వరకూ డిస్కౌంట్ ఇచ్చేస్తున్నారు. జనం అలాగే ఎగబడి కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 వేలు పైనే వస్త్ర దుకాణాలు ఉంటాయి. వీటిలో అత్యధికంగా ఒక్క రాజమహేంద్రవరంలోనే ఉంటాయి.ఈ ఒక్క ఆషాఢంలోనే కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుందని యజమానులే చెబుతున్నారు.ఎందుకంటే ఆషాఢం తరువాత వచ్చేది శ్రావణమాసం కావడంతో ఇప్పటి నుంచే సన్నద్ధమైపోతారు. డిస్కౌంట్ చీరలు కొంటారు.

నాడు వ్యాపారం నిల్.. నేడు ఫుల్..

ఆషాఢమాసం వచ్చిందంటే 'ఆషాఢం డిస్కౌంట్ సేల్' అనే బోర్డులు దాదాపు అన్ని దుకాణాల వద్ద చూస్తుంటాం. ఆషాఢం డిస్కౌంట్లకు ఎదురు చూసేవాళ్లూ లేకపోలేదు. వస్త్రాలు, చెప్పుల షాపుల వద్ద ఎక్కువగా రాయితీలు కనబడుతుంటాయి. వ్యాపారం ముసు గులో ఒకరికి మించి మరొకరు రాయితీలను ప్రకటిస్తుంటారు. ఆషాఢంలో సాధారణంగా పెద్దగా వ్యాపారాలు సాగవు. దీంతో బేరాలు పెరగడానికి డిస్కౌంట్లు పెడుతుంటారు. కొన్నేళ్ల కిందట డిస్కౌంట్లు కాస్త సహేతుకంగా సాగేవి. వ్యాపారులు ఆషాఢంలో పాత స్టాకును క్లియర్ చేసుకునేవారు. రాను రాను ఆషాఢం సేల్స్ అంటే మోసానికి నిలువెత్తు నిదర్శనంగా మారిపోయింది. అసలు ధరలను ఇష్టానుసారం వేస్తూ తగ్గింపును భారీ గా చూపించి ప్లాట్‌ఫాం సరుకును పెద్ద దుకాణాల్లో సైతం అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి.

రాయితీలో కిటుకు

ఆషాఢంలో క్లియరెన్స్ సేల్ కాస్తా డిస్కౌంట్ ధమాకాగా మారిపోయింది. ఎవరైనా రూ.100కి కొని రూ.40కి విక్రయిస్తారా? కచ్చితంగా జరగదు. మరి ఈ డిస్కౌంట్ల మేళా ఏమిటి? అంటే అదో పెద్ద మోళీ. వినియోగదారులను దుకాణంలోకి రప్పించడమే లక్ష్యంగా డిస్కౌంటు బోర్డులు తగిలిస్తారు.లోపలకు వెళ్లాక డిస్కౌంటు ధరల వస్త్రాలు చూస్తే నీరసమొస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వస్త్రాలను చూస్తారు. వాటికి ఒక్క రూపాయి డిస్కౌంటు ఇవ్వరు. డిస్కౌంటు కోసం వెళ్లిన వాళ్లు ఏ డిస్కౌంటూ లేని దుస్తులను కొనక తప్పదు. ఇదే అదనుగా వీటి ధరలను విపరీతంగా బాదేస్తుంటారు.

అసలు ధర ఎంతబ్బా?

వస్త్రాలు, చెప్పులు, బూట్లు వంటి వాటి అసలు ధరలు చెప్పడం ఎవరి తరమూ కాదు. వ్యాపారులు ఎంతకు హోల్‌సేల్‌గా కొంటున్నారో.. వాటికి రవాణా తదితర ఖర్చులతో కలిపి ధర ఎంత నిర్ణయించాలో అనే సహేతుకత లేదు. దీనిపై ఎవరి నియంత్రణా లేదు. ధరల నిర్ణయం, తనిఖీల్లో ప్రభుత్వ యంత్రాంగం పాత్రా అంతంత మాత్రమే. దీంతో ధరలను ఇష్టానుసారం వేస్తుంటారు. ఉదాహరణకు ఒక చీర ధర రూ.5 వేలు చూపించి 60 శాతం డిస్కౌంట్ అంటూ రూ.3 వేలు మినహాయిస్తారు. రూ.2 వేలకే రూ.5 వేల విలువ చేసే చీర అంటే జనం ఎగబడతారు. వాస్తవానికి ఎంఆర్పీ అంటే గరిష్ఠ చిల్లర ధర. వ్యాపారులు దీనిని చూపించి తగ్గించడం కుదరదంటూ బురిడీ కొట్టిస్తారు. ఎంఆర్పీపై కూడా తగ్గింపు ఇస్తున్నామంటూ దయ చూపించేస్తారు. వాస్తవానికి ఆ స్టిక్కర్లన్నీ వాళ్లు అంటించినవే కదా!. పైగా ఎంఆర్పీపై బేరమాడే వెసులుబాటు కచ్చితంగా వినియోగదారుడికి ఉందనే విషయం ఎంత మందికి తెలుసు?.

నకిలీ..మకిలీ!

ఆషాఢం సేల్స్‌లో భాగంగా బ్రాండ్ల పేరుతో బురిడీ కొట్టిస్తు న్నారు. ప్రముఖ కంపెనీ వస్త్రాలు, బ్యాగులు, బూట్లు, చెప్పు లు, హ్యాండ్ బ్యాగులు, డోర్ మ్యాట్‌లు అంటూ జనాలను మోసగి స్తున్నారు. ప్రముఖ బ్రాండ్లకు పోలిన నకిలీలను రాశులుగా పోస్తున్నారు. వాటిపై విపరీతమైన రేట్లు వేస్తున్నారు. ఓ ప్రముఖ కంపెనీ యాంబ్లమ్(చిహ్నం)తో ఉండే టాప్‌లు, హ్యాండ్‌బ్యాగ్, షూ వంటి వాటిపై వేలల్లో ఎంఆర్పీ పెడుతు న్నారు. ఏకంగా 70 శాతం డిస్కౌంట్ ధరకే ఇస్తున్నామని మోసగిస్తుస్తున్నారు. ఉదాహ రణకు ఒక బ్రాండెడ్ షూ ధర రూ.10 వేలు ఎంఆర్పీ చూపించి 70శాతం డిస్కౌంట్ అంటున్నారు. అంటే రూ.3 వేలకే బ్రాండెడ్ షూ వస్తుందని వినియోగదారుడు ఆశ పడుతున్నా డు. కానీ అది నకిలీ అని తెలుసుకోలేక పోతున్నారు. వాస్తవానికి ఆ షూ ధర రూ.500 కూడా ఉండకపోవచ్చు. అతి చిన్న తేడాలతో అసలైన బ్రాండుకు అతి దగ్గరగా యాంబ్లమ్‌లను ప్రింట్ చేస్తుండడంతో వినియోగ దారులు మోసపోతున్నారు.

ఆధ్యాత్మికతకు.. 'నెల'వై!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

హిందూ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచేది ఆషాఢం..తెలుగు సంవత్సరంలో నాలుగో నెల. శూన్యమాసమైనా.. శుభకార్యాలు తలపెట్టకపోయినా.. పూజా కార్యక్రమాలకు, దేవతారాధనకు ఇది అనువైన సమయం. అందుకే ఈ మాసంలో అమ్మవార్ల జాతరలు జరుగుతాయి. కొత్త అల్లుళ్లకు ఆషాఢ పట్టీ వినోదాలు, మార్కెట్లలో ఆఫర్లు, తక్కువ ధరలతో వస్త్రాలు, వస్తువుల డిస్కౌంట్ సేల్.. ఇలా చెప్పుకొంటూ పోతే.. ఎన్నో విశేషాలు, వింతలకు ఈ మాసం నిలయం.ఈ మాసంలో పుడమి పులకించడంతో ఎక్కడ చూసినా ఆహ్లాదకరమైన హరిత వాతావరణమే కనిపిస్తుంది. దుమ్ము ధూళితో దర్శనమిచ్చే తరువులన్నీ తలంటు పోసుకున్నట్టుగా నిగనిగలాడుతుంటాయి. వ్యవసాయ పనుల ప్రారంభానికి అనువైన మాసం కావడంతో ఇంట్లో వారందరూ కష్టపడి పనిచేసేందుకు ముందుకు వెళ్లాల్సిన సమయం. ఆషాఢంలో వివాహాలు, గృహ ప్రవేశాలు చేయరు. ఇంటి నిర్మాణాలు చేపడితే ఆ ఇంటికి ధనధాన్యాలు, పశుసంపద, రత్నమాణిక్యాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసాన్ని శుచి మాసం అని కూడా అంటారు. ఇంట్లోని కంచు, ఇత్తడి వంటి వస్తువులను శుభ్రపరచుకోవడం, బంగారం, వెండి వస్తువులను మెరుగుపెట్టించుకోవడం చేస్తుంటారు. ఈ నెల రోజులు గ్రామ దేవతల పేరుతో వెలసిన అమ్మవారికి పూజలు చేసి భక్తిభావంతో కొలుస్తారు. వారాహి గుప్త నవరాత్రులు ఈ మాసంలోనే ప్రారంభమవుతాయి. ఆషాఢ శుద్ధ తొలిఏకాదశి, ఆషాఢ పూర్ణిమ, ఆషాఢ బహుళ సప్తమి, ఆషాఢ బహుళ ఏకాదశి పర్వదినాలు ప్రత్యేకమైనవి. ఈ సమయంలోనే కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మరిడమ్మ, తలుపులమ్మ లోవ, నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయాల్లో భక్తుల సందడి ఉంటుంది. ఆషాఢంలో మునగాకును తప్పనిసరిగా తింటారు. మునగాకు కలిపిన కూరలు తినడంవల్ల ఒంటికి వేడి చేసి వర్షాకాలంలో ఒంటిని సమశీతోష్ణ స్థితిలో ఉంచుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

పంటకాల్వలు.. ఉప్పునీటిమయం!

» వరి నారుమడులు పోసేదెలా?
» చెరువుల నుంచి ఉప్పునీటిని కాల్వల్లోకి తోడేస్తున్న ఆక్వా రైతులు
» ఇరిగేషన్‌శాఖ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం



అల్లవరం మండలం తుమ్మలపల్లి పంటకాల్వలో ఆక్వా చెరువుల ఉప్పునీరు

అల్లవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందించాలని పంటకాల్వల్లో ఉప్పునీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉప్పునీటితో ఉన్న పంటకాల్వల్లో నీటితో నారుమడులు ఎలా పోయాలని ఇరిగేషన్‌శాఖ నిర్లక్ష్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తా చెదారంతోపాటు ఉప్పునీటితో పంటకాల్వలు డ్రెయిన్లను తలపిస్తున్నాయి. ఆక్వా చెరువు నుంచి రైతులు ఉప్పునీటిని పంటకాల్వలోకి తోడేస్తున్నా ఇరిగేషన్, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లవరం మండలంలోని పంటకాల్వల్లోకి ఇళ్లు, హోటళ్లకు చెందిన చెత్తా, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేస్తున్నారు. పంటకాల్వల గట్లు కుచించుకుపోయి వెడల్పు లేక మూసుకుపోతున్నా ఏళ్ల తరబడి తవ్వకాలు లేవు. తూడు తొలగింపుతో సరిపెడుతున్నా మళ్లీ మూసుకుపోతున్నాయి. తుమ్మలపల్లి బెండా, సామంతకుర్రు, తాడికోన, కొమనగిరిపట్నం, గుండెపూడి, తూర్పులంక, ప్రధాన పంట కాల్వల్లోకి ఆక్వా రైతులు తమ చెరువుల్లోని ఉప్పునీటిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. సాగునీరు, తాగునీరు కలుషితమైందని ఆరోపిస్తున్నారు. మండల పరిధిలో 4వేల హెక్టార్లలో వరి సేద్యం చేయడానికి సార్వా నారుమడులు పోయాలంటే ఉప్పునీటితో ఇబ్బందులు తప్పవంటున్నారు. కొన్నిచోట్ల డ్రెయిన్ల నుంచి కాల్వలోకి ఉప్పునీరు పారుతోంది. లక్షలాది రూపాయలతో తూడు తొలగిస్తున్నా నెలరోజులకే మూసుకుపోతున్నాయి. జూలై మొదటివారంలో కూడా పంటకాల్వల్లో ముంపువల్ల నారుమడులు పోయలేని పరిస్థితి నెలకొంది. అల్లవరం మండలానికి ఇరిగేషన్‌శాఖ ఏఈ లేరు. మార్చి నెలాఖరు ఏఈ బదిలీ కాగా రాజమహేంద్రవరం ఏఈకి అదనపు బాధ్యతలు ఇచ్చినా ఆయన కూడా తప్పుకున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ ఏఈ లేని అల్లవరం మండలం సమస్యల వలయంలో చిక్కుకుంది.

బడికి.. వెళదాం!



» రండి..రండి దయ చేయండి
» 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్
» కూటమి ప్రభుత్వంలో రెండోసారి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పాఠశాలలు, కళాశాలలు ముస్తాబవుతున్నాయి.. పేరెంట్స్ టీచర్ మీటింగ్‌కు సన్నద్ధమవుతున్నాయి.కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమావేశాలు నిర్వహించడం రెండోసారి. ఆ రోజున అమ్మపేరుతో మొక్కలు నాటడం, ఫొటో బూత్ వద్ద తల్లిదండ్రులతో ఫొటోలు దిగడం, ఆటలపోటీలు, సహపంక్తి భోజనాలు ఇలా పండుగ వాతావరణంలో సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిసారి గతేడాది డిసెంబరు నెలలో నిర్వహించిన మెగా పీటీఎం విజయవంతం కావడంతో ఈసారి మెగా పీటీఎం-2.0 నిర్వహిస్తున్నారు.

అందరి భాగస్వామ్యంతో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పాఠశాలలు, కళాశాలల పనితీరు, విద్యాబోధనలో పలు మార్పులు తెచ్చారు. వీటిని తల్లిదండ్రులకు వివరించడం, పాఠశాలల అభివృద్ధిలో వారితో పాటు పూర్వ విద్యార్థులు, విద్యారంగ ప్రముఖులు, దాతలను భాగస్వాములు చేయడం లక్ష్యంగా దేశంలోని విద్యారంగ చరిత్రలో తొలిసారి గతేడాది డిసెంబరు 7న నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సత్ఫలితాలను ఇచ్చింది. రెండో విడత ఈనెల 10న ఈ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-2.0(మెగా పీటీఎం) నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంపై ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్లు అన్ని జిల్లాల అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు ఇచ్చారు.సమావేశం ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై రాష్ట్రస్థాయి నుంచే మినిట్ టూ మినిట్ ప్రోగ్రామ్‌ను పంపించారు.

ఫొటో సెషన్, ఆటల పోటీలు

10న ఉదయం 9గంటలకు సమావేశాలు ప్రారంభించి మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిస్తారు. ఉదయం తల్లిదండ్రులు, ఇతర ప్రముఖులను పాఠశాలకు ఆహ్వానిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసే ఓపెన్‌హౌస్ ఫొటోబూత్ వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఫొటో దిగే ఏర్పాటు చేయనున్నారు. అనంతరం తమ పిల్లలతో కలిసి వారి క్లాస్‌రూమ్‌లో తల్లిదండ్రులు కూర్చునేలా, ఇతర ప్రముఖులు హెచ్ఎం రూమ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో సంబంధిత క్లాస్ టీచర్ ప్రత్యేకంగా సమావేశమై వారి పిల్లల సమగ్ర పురోగతి కార్డులు(ప్రోగ్రస్ కార్డు), హెల్త్ కార్డును అందిస్తారు. అదే సమయంలో వీడియోల ద్వారా తల్లికి వందనం పథకం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్, మన బడి మేగజైన్ తదితర అంశాల గురించి అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల తల్లులకు రంగోళి లేదా లెమన్ అండ్ స్పూన్ లేదా మ్యూజికల్ చైర్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. 11గంటలకు సమావేశాలు ప్రారంభించి మా తెలుగు తల్లికి పాట అనంతరం తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్దేశించారు.ఇందులో భాగంగా విద్యార్థులతో వారి తల్లులకు పుష్పాలు సమర్పించి పాదాలకు నమస్కరించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా తల్లి పేరుతో మొక్క నాటడం, గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. నో టూ డ్రగ్స్, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యులవుతామంటూ సామూహిక ప్రతిజ్ఞ ఉం టుంది. చివరగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీ ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, ఆహ్వానితులు కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని చేస్తారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కామన్ లంచ్ ఏర్పాటు చేయాలి.

పండుగలా పేరెంట్ మీట్ నిర్వహించాలి

పి.రమేష్, కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ అనేది ప్రతి పాఠశాలకు పండుగలాంటిది. మన ఇంట జరుపుకునే ఉత్సవం మాదిరిగా దీన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అన్ని పాఠశాలల్లోను 10న ఈ సమావేశాలు నిర్వహించాలి. ఇందులో ఎవరికీ మినహాయింపులు లేవు. ఇప్పటికే కార్యక్రమ నిర్వహణపై ఆయా పాఠశాలల హెచ్ఎంలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు చేయాల్సిన ఏర్పాట్లు, సమావేశ నిర్వహణ టైమ్ టూ టైమ్ షెడ్యూల్‌ను పంపించాం.

9 నుంచి మోటారు వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ

» జిల్లా రవాణాశాఖాధికారి

అమలాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మోటారువాహనాలకు ఈనెల 9 నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్టు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఎ.వేమవరంలో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. రవాణా వాహనాలు, మోటారు వాహనాలకు ఫిట్‌నెస్ శ్లాట్‌లు అన్నీ ఏటీఎస్‌లకు బుక్ చేసుకోవచ్చునని, అందుకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో తగు సవరణలు జరిగాయని అన్నారు. వాహనదారులు, లారీ ఓనర్స్ యూనియన్ ఈ విధానాన్ని గమనించి ఏటీఎస్ ద్వారా వాహనాల సామర్థ్య పరీక్షలు నిర్వహించుకుని ధ్రువీకరణ పత్రాలు పొందాలని శ్రీనివాసరావు కోరారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

» కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలను అర్జీలుగా స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాల్లో, నాలుగు మున్సిపల్ కార్యాలయాల్లో, 22 మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులోఉండి ప్రజాసమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీదారులు తమ అర్జీలను పీజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లోను నమోదు చేయవచ్చునన్నారు. నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతులను 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు. నిర్దేశితస్థాయిల్లో ప్రజా సమస్య పరిష్కార వేదికలను ఆశ్రయించి తమ సమస్యలకు పరిష్కార మార్గాలు పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

భక్తులతో పోటెత్తిన సత్యదేవుడి సన్నిధి

తొలి ఏకాదశి పర్వదినాన

రూ.60 లక్షల ఆదాయం


సత్యదేవుడి దర్శనానికి బారులుతీరిన భక్తులు

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవుదినం ఏకాదశి పర్వదినంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఉదయం 5గంటలనుంచి వ్రతాలు ప్రారంభించారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 2గంటలు, ఉచిత దర్శనానికి 3 గంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచిఉన్నారు. వ్రతమండపాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఇటీవల వివాహాలు చేసుకున్న జంటలకు తొలిపండుగగా భావించే తొలిఏకాదశి రోజున స్వామిని దర్శించుకున్నారు. సుమారు 4వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో సుబ్బారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


సత్యదేవుడి ప్రసాదం కోసం క్యూలో ఉన్న భక్తులు

ప్రముఖుల పూజలు

సత్యదేవుడిని ఆదివారం దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, బీసీ సంక్షేమశాఖ ప్రిన్స్‌పాల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలకగా వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

1.20 లక్షల ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

సత్యదేవుడి సన్నిధిలో అమృతతుల్యంగా భావించే స్వామివారి గోధుమ రవ్వ ప్రసాదం అమ్మకాలు ఆదివారం ఒక్కరోజే రూ.1.20 లక్షల ప్యాకెట్ల విక్రయాలు జరిగినట్టు ప్రసాదం విభాగ అధికారి పోల్నాటి లక్ష్మీనారాయణ తెలిపారు. తొలిఏకాదశి సందర్భంగా రత్నగిరికి విచ్చేసిన భక్తులతో పాటుగా తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో తమ స్వస్థలాల కు వెళ్లే భక్తులు జాతీయ రహదారిపై 2 నమూనాలయాలు, తొలిపావంచా వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్లలో కలిపి ఈ అమ్మకాలు జరగగా ఒక్క ప్రసాదాల విక్రయాల ద్వారా సుమారు రూ.24 లక్షల ఆదాయం సమకూరింది.

సత్యదేవుడి దేవేరికి

వజ్రాల నక్లెస్ బహూకరణ


వజ్రాల నక్లెస్

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దేవేరి అనంతలక్ష్మి సత్యవతీదేవికి ఆదివారం రూ.19 లక్షల విలువైన వజ్రాల నక్లెస్‌ను బహూకరించారు. పెద్దాపురం లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్లలో ఒకరైన మట్టే ఆది శంకర్, స్రవంతి దంపతులు వీటిని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. ముందుగా ఆభరణం సంప్రోక్షణ చేసి అమ్మవారికి అలంకరించారు. దాతలను ఈవో అభినందించి స్వామివారి దర్శనం, వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్‌లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ సూర్యకమల దంపతులున్నారు. ఈ ఆభరణం నిత్యఅలంకరణ చేపట్టాలని దాత కోరారు.


ఆలయ ఈవో సుబ్బారావుకు వజ్రాల నక్లెస్ అందజేస్తున్న దాత

ప్రసాద్ స్కీం పనులకు మరో ముందడుగు

రత్నగిరిపై వచ్చే నెలలో పనులు ప్రారంభించే అవకాశం : టూరిజం అధికారులు


అన్నవరం దేవస్థానం అధికారులతో కలసి స్థల పరిశీలన చేస్తున్న టూరిజం అధికారులు

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం పనులకు మరో ముందడుగు పడింది. గతేడాది నిధులు మంజూరై వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు పనులు ప్రారంభంకాలేదు. దీనికి సంబంధించి టెండర్లు పిలిచి ఖరారుచేయగా సింహాచలం చందనోత్సవం సమయంలో గోడకూలి పలువురు మరణించడం, గోడకట్టిన నిర్మాణ కాంట్రాక్టర్ అన్నవరం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒక్కరే కావడంతో ఆ సంస్థను ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో మరోమారు టెండర్లును పిలిచారు. అన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, అధునాతన టాయిలెట్ల నిర్మాణాలకు కలిపి సుమారు రూ.18.98 కోట్లతో టెండర్లు పిలవగా వాటిని తెరిచినా సాంకేతిక కారణాలతో వాటిని ఫైనల్ చేయలేదు. అయితే ఈ వారంలో టెండర్లు ఫైనల్ అవుతాయని, వచ్చే నెలలో పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్టు టూరిజం అధికారులు తెలిపారు. ఆదివారం టూరిజం శాఖ ఎస్ఈ ఈశ్వరయ్య, డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేష్ ప్రసాద్‌స్కీం ద్వారా నిర్మించబోయే నిర్మాణాల స్థలాన్ని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈవో సుబ్బారావును కలసి టెండర్ల ఖరారుపై చర్చించారు. ఈ నిర్మాణాల్లో దేవస్థానం కేవలం పర్యవేక్షణ మాత్రమే చేయనుంది. నిధులు, కాంట్రాక్ట్ ఇతర పనులు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

తెలుగు టీచర్ ఔదార్యం

హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహం



ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహం

సర్పవరం జంక్షన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అన్నపూర్ణాదేవిగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ చరిత్రను భావితరాల విద్యార్థులకు చాటి చెప్పేలా తెలుగు ఉపాధ్యాయురాలు సీతమ్మ విగ్రహం తయారు చేయించారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు ముత్య వెంకటలక్ష్మి. ఆమె చేస్తున్న విద్యాబోధన, ఇతర సేవా కార్యక్రమాలకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. డొక్కా సీతమ్మ విగ్రహాన్ని హైస్కూల్ ప్లస్‌లో ఏర్పాటు చేయాలని భావించి విద్యాశాఖ అధికారుల అనుమతి తీసుకున్నారు. సుమారు రూ.78 వేలు వెచ్చించి కొత్తపేటకు చెందిన ప్రముఖ విగ్రహ శిల్పి రాజ్‌కుమార్ వడియార్‌తో విగ్రహాన్ని తయారుచేయించి హైస్కూల్‌కి తరలించారు. విగ్రహాన్ని సోమవారం డీఈవో రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంతం నానాజీతో కలసి విద్యాశాఖ అధికారులు ప్రారంభోత్సవం చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావు స్ఫూర్తితో డొక్కా సీతమ్మ చరిత్ర విద్యార్థులకు తెలపాలని విగ్రహాన్ని తయారు చేయించినట్టు రామలక్ష్మి తెలిపారు.


విగ్రహాన్ని తయారుచేయించిన ముత్య వెంకట రామలక్ష్మి

వెయ్యి కిలోల పశుమాంసం స్వాధీనం

నలుగురిపై కేసు

గొల్లప్రోలు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులోని అనధికారిక పశు కబేళాపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడులు చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న వెయ్యి కిలోల పశుమాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా పశువులను వధించిన అరుగుల తాతయ్య, గుడివాడ గున్నయ్య, వాసా జగదీష్, మిరియాల రమేష్‌పై కేసు నమోదు చేసి 4 మోటారు సైకిళ్లు, మినీ ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు. పశుమాంసాన్ని పూడ్చి కేసు దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌లో జరిగిన హత్యాయత్నం సంఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. బైపాస్‌రోడ్డులో తాటిపర్తికి వెళ్లే రహదారి సమీపంలో జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసి అనిశెట్టి వంశీ అనే వ్యక్తిని జ్యోతుల రాము, ఊటా ఇంద్ర కత్తితో పొడిచిన సంగతి తెలిసిందే. దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు. అరెస్టు చేసిన ఇద్దరిపై చత్తీస్‌ఘడ్‌లో గంజాయి కేసులు ఉన్నాయని వారు పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో 18 మందికి గాయాలు

కాట్రేనికోన, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో శనివారం రాత్రి పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. 18 మందిని కరిచింది. బాధితులు కాట్రేనికోన పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స పొందారు. మెరుగైన చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి పంపించినట్టు వైద్యాధికారి జి నీలిమ తెలిపారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా మరికొందరు కాకినాడలో చికిత్స తీసుకుంటున్నారు.

కత్తిపూడిలో చోరీ

శంఖవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన రైతు శివ ఇంట్లో ఆదివారం తెల్లవారు జామున దొంగలు చొరబడి 50 తులాల వెండి, రూ.10వేలనగదు, టీవీ అపహరించుకుని పోయారు. గత శుక్రవారం బాధితుడి నానమ్మ చనిపోగా క్రతువుల కోసం మూడు రోజులుగా సోదరుడి ఇంట్లో ఉంటున్నారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు అన్నవరం పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన సంఘటన తుని రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. సుమారు 50 ఏళ్ల కలిగిన వ్యక్తిని నర్సీపట్నం రోడ్డు సమీపంలో రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. సంబంధీకులు 94906 19020లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్

- కాకినాడలో రెండు సహాయకేంద్రాల ఏర్పాటు
- ఇంజనీరింగ్ కోర్సుల షెడ్యూల్ విడుదల
- 7 నుంచి 16 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు

జేఎన్టీయూకే, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్-2025 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. దీనికి సంబంధించిన మొదటి పేజ్ నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ జారీచేశారు. 7నుంచి 16 వరకూ ఏ ర్యాంకువచ్చినా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కోవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 26 ఇంజనీరింగ్ కళాశాలల్లో సుమారు మొత్తం 16,660 సీట్లుండగా అక్కడా, జేఎన్టీయూకేలోని 2ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో 520 సీట్ల వరకూ ఉండగా, 24 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 16,140 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ జిల్లా పరిధిలో 6,343, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 2868, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 6011మంది విద్యార్థులు ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించారు.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజుచెల్లింపు, రిజిస్ట్రేషన్: ఈనెల 7నుంచి 16 వరకూ
- ధ్రువపత్రాల పరిశీలన: ఆన్‌లైన్‌లో ఈనెల 7 నంచి 17వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు: ఈనెల 13నుంచి 18వరకూ.
- ఆప్షన్ల మార్పు: ఈనెల 19.
- సీట్ల కేటాయింపు: జూలై 22
- కళాశాలల్లో రిపోర్టింగ్: ఈనెల 23నుంచి 26 వరకూ
- తరగతులు ప్రారంభం: ఆగస్టు 4 నుంచి

సందేహాలుంటే...

అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల, కాకినాడ జేఎన్టీయూకేలో ఏర్పాటు చేసిన సహాయకేంద్రంలలో సంప్రదించాలి.

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలు

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా

అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్‌టికెట్, పుట్టినతేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించి అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ కొట్టాలి.

రజకుల సమస్యలు కేంద్రం దృష్టికి తీసుకెళ్తా

- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ
- రాజమహేంద్రవరంలో రజకుల ఆకాంక్ష సభ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రజకుల అవసరాలను, వారి సమస్యలను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, వారిని ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర సామాజిక, న్యాయశాఖామంత్రితో రజక సంఘ ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రజకుల ఆకాంక్ష సభ నిర్వహించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేశారు. కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రజకుల అభ్యున్నతికి వారికి అవసరమైన డిమాండ్లకు తన మద్దతు ఉంటుందన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రజకుల సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రజకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ బీసీ కుల వృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు రాజ్యాంగపరమైన చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ రజకులకు మేలు చేకూర్చే జీవో 27ను అమలుపై రాష్ట్ర మంత్రులకు విన్నవించగా సానుకూల స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ రంగంలోని దోబీ పోస్టులు, కాంట్రాక్టులను రజకులకు కేటాయించేలా ప్రత్యేక జీవో తీసుకురావాలని కోరుతున్నామని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రజకసేవా సంఘం నాయకులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు, రజకులు పాల్గొన్నారు.


శ్రీనివాస వర్మకు వినతిపత్రం అందజేస్తున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి



సభలో మంత్రి దుర్గేష్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

ఎస్ఐ కుటుంబానికి రూ.25 లక్షల సాయం


ఎస్ఐ అశోక్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ఎస్ఐలు

నరసాపురం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలంగాణలోని కోదాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ అశోక్ కుటుంబానికి 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు రూ.25లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆంధ్ర, తెలంగాణలో వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఈ బ్యాచ్‌కు చెందిన 1140మంది సీఐలు, ఎస్ఐలు ఈ మొత్తాన్ని సేకరించారు. ఆదివారం ఎస్ఐ సొంత ఊరు నరసాపురంలో జరిగిన అశోక్ సంతాప కార్యక్రమానికి హాజరై ఎస్ఐ కుటుంబానికి అందించారు. పిల్లల చదువులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే ఈ ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ బైసన్ జీవన్‌కు రూ.5 లక్షల సాయం చేశారు.

తగ్గుముఖం పడుతోన్న గోదావరి ఉధృతి

2,18,257 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద ఆదివారం ఉదయానికి 10.90 అడుగుల నీటి మట్టం ఉండగా 2.11లక్షల క్యూసెక్కులు బ్యారేజ్ గేట్ల ద్వారా దిగువకు ప్రవహించింది. సాయంత్రానికి నీటి విడుదలను మరింత పెంచి ధవళేశ్వరం ఆర్మ్‌లో 50గేట్లను 40మీటర్లు, 20గేట్లను 80 మీటర్లు, ర్యాలి ఆర్మ్‌లో 43గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 20 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 39 గేట్లను 40మీటర్ల మేర పైకి ఎత్తి 2,18,257క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో బ్యారేజ్ దిగువ భాగం జలకళ సంతరించుకుంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.10 అడుగులుగా నమోదైంది. భద్రాచలం వద్ద 20.30 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ 18.50 అడుగులకు చేరుకుంది.

టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో నవజాత శిశువు మృతి

బంధువుల ఆందోళన


మృతిచెందిన నవజాత శిశువు

ఐ.పోలవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో ఆదివారం నవజాత శిశువు మరణించడంతో బాధిత కుటుంబం, బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే పుట్టిన బిడ్డ మరణించాడంటూ నినాదాలు చేశారు. ఐ.పోలవరం పంచాయతీ పెదమడికి చెందిన ధరణి కేశనకుర్రు పీహెచ్‌సీలో ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. ఆమె ప్రసవం కోసం టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో చేరింది. ఆదివారం ఆమెకు శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. పుట్టిన మగబిడ్డ కొద్ది సేపటికి మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతిచెందినట్టు ఆరోపిస్తూ బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఎస్ఐ రవీంద్రబాబు ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామన్నారు. దీనిపై సూపరింటెండెంట్ దయానాను వివరణ కోరగా వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు. అయితే టి.కొత్తపల్లి ఆసుపత్రిలో తరచూ జరుగుతున్న ఇటువంటి సంఘటనలపై శాఖాపరమైన దర్యాప్తు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.


పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

13న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్ల ఎంపిక, ఒకరోజు ఉమ్మడి జిల్లా చాంపియన్‌షిప్ పోటీలు రాజమహేంద్రవరంలోని వీకేవీటీ కళాశాలలో ఈనెల 13వ జరుగుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. 2007 జనవరి 1 తర్వాత పుట్టిన వారే ఇందులో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. పాల్గొనదలచిన వారు ఒరిజనల్ ఆధార్, పుట్టిన తేది ధృవీకరణపత్రాలు తీసుకురావాలని కోరారు. ఇందులో ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనవారు పిఠాపురంలో ఆగస్టు 14 నుంచి 17 వరకూ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కరెంటు బిల్లు.. గుండె ఝల్లు...



రూ.3,38,496 వచ్చిన బిల్లు

మలికిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మలికిపురంలో ఒక షాపింగ్ కాంప్లెక్సులో ఉన్న రెడీమేడ్ దుస్తుల షాపునకు జూలై నెల కరెంటు బిల్లు రూ.3,38,496 వచ్చింది. బిల్లును చూసి షాపులో అద్దెకు ఉంటున్న కె.యువకుమార్ ఆశ్చర్యానికి లోనయ్యాడు. వెంటనే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపినట్టు తెలిసింది. గతంలో రూ.1500 నుంచి రూ.2వేల వరకు బిల్లు వచ్చేదని యువకుమార్ తెలిపాడు.

'లోవ'లో లక్ష తులసి పూజ

తుని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం అమ్మవారికి పండితులు లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు వేలాదిగా పోటెత్తారు. ఆలయానికి రూ.8.50లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.


తులసి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడలో అంతర్ జిల్లా ఈత పోటీలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న స్విమ్మర్ గోలి శ్యామల

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని ఈత కొలనులో 10వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీలు జరిగాయి. సుమారు 150 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ జాతీయ మారథాన్ స్విమ్మర్ గోలి శ్యామల మాట్లాడుతూ ప్రతి ఒకరు కూడా విద్యార్థి దశ నుంచే నడవడిక నేర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. మరో ముఖ్య అతిథిగా డీఎస్‌డీవో శ్రీనివాస్ కుమార్ హాజరయ్యారు. కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో గ్రూప్ బాయ్స్ విభాగం నుంచి కే.వీరశివకృష్ణ, ఎం.గోకుల కన్నా, కే ముత్యాల ముఖేష్, వి.మణికంఠ నవీన్, టి.దుర్గేష్.. గ్రూప్ వన్ గర్ల్స్ విభాగంలో పి.సహస్ర శ్రీ.. గ్రూప్ టుబాయ్స్ విభాగంలో టీవీసీ.సాయి సాకేత్, పి.కౌశిక్ వర్ధన్ మిచిల్ అర్జున్, ఏ.అభిసాయి, వై.గౌతమ్, ఏ అక్షిత, వీరాజ్ విజయ్ కాలే, వెనిస్టెంట్ చార్లెస్ స్టీఫెన్.. గ్రూప్ టూ గర్ల్స్ విభాగంలో సీహెచ్.హిమద్యోతి, కే.తనుశ్రీ.. గ్రూప్ త్రీ బాయ్స్ విభాగంలో కే.దర్శిల్, ఎస్.క్రితిక్, ఎం.షణ్ముఖీవర్, ఏం.సాయిచరణ్, జి భువనేష్, జి.రోబిన్... గ్రూప్ త్రీ గర్ల్స్ విభాగంలో ఎస్ గుల్బర్, జి.అన్విధ, ఎం.పల్లవి, ఎం.ఆశస్విని ఎంపికయ్యారు. వారంతా ఈనెల 19, 20న విశాఖపట్నంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పదోవ సబ్ జూనియర్ అంతర జిల్లాల ఈతల పోటీల్లో పాల్గొంటారు. స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసుమల్ల రాజు, ముఖ్య సలహాదారుడు మంగా వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కోచ్‌లు ఎం.అజయ్‌కుమార్, పీప నాయుడు, వి.వీరభద్రయ్య, ఎల్.రాకేష్, జి.మురళీకృష్ణ ఈత క్రీడాకారులను ఎంపిక చేశారు.

'జూనో'లో జాలీగా..

– రాజమహేంద్రవరం సిటీ

జూనోసిస్ డే సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పశువుల ఆసపత్రి వద్ద వివిధ రకాల జంతువులను వ్యాక్సిన్ కోసం తీసుకొచ్చారు. ఆ చిత్రాలే ఇవి.





దుర్గాప్రసాద్ కుటుంబానికి డీటీవో పరామర్శ

అంతర్వేది, జూలై 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలేనికి చెందిన కామాని దుర్గాప్రసాద్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందాడు. కన్నతల్లే కుమారునికి దహన సంస్కారాలు నిర్వహించింది. జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆదివారం దుర్గాప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి తల్లికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

తెగుళ్లు వ్యాపించకుండా విత్తనశుద్ధి

రాజోలు, జూలై 6(ఆంధ్రజ్యోతి): తాటిపాక యూనిట్‌లో మహిళా సంఘాల సభ్యులతో విత్తనాల నుంచి తెగుళ్లు వ్యాపించకుండా బీజామృతంతో విత్తన శుద్ధి చేయించామని యూనిట్ ఇన్‌చార్జి పి.ప్రసన్నకుమార్ ఆదివారం తెలిపారు. రైతు నీతిపూడి ధర్మరాజు, డ్వాక్రా సంఘాల సభ్యులతో విత్తనశుద్ధి చేయించామన్నారు.

దేశాభివృద్ధికి జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు

- బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి
- ప్రజాప్రతినిధుల నివాళి

అమలాపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధునిగానే కాకుండా దేశాభివృద్ధికి కేంద్రంలో పలు మంత్రి పదవులు నిర్వహించి ఎనలేని సేవలు చేసిన ఘనత డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్‌కు దక్కుతుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, మాదిగల పొలిటికల్ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మడికి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడలికి శ్రీరాములు, ఏబీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, నవుండ్రు వాడపల్లి, ఉందుర్తి సతీష్, మోహనరావు, అయినవిల్లి అర్జున్, నల్లొండ రమేష్ పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు.స్థానిక పెద్రిరోడ్డు, భీమ్‌నగర్ వద్ద గల బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు యానాం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి, మున్సిపల్ కమిషనర్ అఖిల్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. యానాం సమాచార శాఖాధికారి కేఎల్‌వీ ప్రసాద్, గూటం రాంబాబు, రాజు,


పి.గన్నవరంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

సమ్మె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాయకులు గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల సుబ్బారావు, దొమ్మేటి సాయికృష్ణ, కొర్లపాటి గోపి, అరిగెల సూరిబాబు, ఉందుర్తి నాగబాబు, పి.కె.రావు, విత్తనాల శేఖర్, మైపాల తాతాజీ, పెదపూడి శ్రీనివాస్, మందా రాజేష్ పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): బాబూజగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడి కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. బొమ్మి ఆనందరావు, బొమ్మి చంటి, బి.నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మామిడికుదురులో నిర్వహించారు. స్థానిక బస్టాండు కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు జాలెం శ్రీనివాసరాజా, ఎమ్మార్పీఎస్ నాయకులు నూటుకుర్తి సత్యనారాయణ, ఉండ్రాజవరపు శివ, ముస్కూడి నరసింహస్వామి, చుట్టుగుళ్ల కిశోర్, యార్లగడ్డ రవి, మంద గాంధీ, బొంతు సుధాకర్ పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతిని టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నేదునూరి నాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వస్కా శ్యామ్, రాష్ట్ర కార్యదర్శి చెయ్యేటి నాగేంద్ర, వారా లక్ష్మీనరసింహరామ్, నేదునూరి సత్యనారాయణ, మధుర రమేష్, సవరపు గణపతిరావు, నేదునూరి శ్రీనివాసరావు, నేదునూరి దుర్గారావు, చేట్ల సత్యనారాయణ, సవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో బాబూజగ్జీవన్‌రామ్ చిరస్మరణీయ నాయకుడని, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి స్థానిక నాయకులతో యువతతో కలిసి నివాళులర్పించారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు


అమలాపురం: శ్రీకామాక్షీ అమ్మవారికి మహిళల సమక్షంలో పూజలు నిర్వహిస్తున్న నాగబాబు


కాట్రేనికోనలో సిద్దివినాయకునికి సహస్ర నారికేళ జలాభిషేకం


ముమ్మిడివరం: సీహెచ్ గున్నేపల్లిలో శాకంబరిగా అలంకరించిన అమ్మవారు

ఆలయాల్లో అభిషేకాలు, పూజలు

అమలాపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం తొలి ఏకాదశిని పురస్కరించుకుని మహిళలు అమలాపురం శ్రీకామాక్షీ అమ్మవారికి ఆదివారం బంగారు మంగళసూత్రాలతో పాటు చీర, సారె సమర్పించారు. స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో వేంచేసి ఉన్న అమ్మవారికి మహిళలు బృందాలుగా ఏర్పడి పది గ్రాములతో నాలుగు బంగారు మంగళసూత్రాలు చేయించి సమర్పించారు. తొలుత చీర, సారెతో పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించి సారె సమర్పించారు. పీఠం బ్రహ్మ గోవిందవఝల నాగబాబు యాజ్ఞికంలో పీఠం ఉత్తరాధికారి శ్రీవిఘనస రాజీవ్‌ప్రేమ్ కామాక్షీ అమ్మవారికి విశేష కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వల్లభ కోలాట బృందం చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. సరిపెల్ల అనంతలక్ష్మి విజయకుమారి, బాలిరెడ్డి రాధిక, బెత్సా రత్నరాధిక తదితర మహిళా భక్తుల ఆధ్వర్యంలో సారెను సమర్పించారు. భక్తులకు విఘనస రాజీవ్‌ప్రేమ్ దివ్య మంగళ శుభాశీస్సులు అందజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీకామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వక్కలంక వాణి, సభ్యులు వీరా నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యనారాయణ, మేనేజర్ దుర్గారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి-చంద్రశేఖర్ దంపతులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన సత్తెమ్మతల్లి ఆలయం

ముమ్మిడివరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం రెండో ఆదివారం కావడంతో సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి ఆలయం భక్తులతో పోటెత్తింది. జిల్లా నలమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గుమ్మళ్ల రాము సమకూర్చిన కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. గొలకోటి మల్లిబాబు, రేచర్ల నాగభూషణం, మంద దేవీదుర్గ, సంధ్యాల నరేష్, పోలిశెట్టి రమేష్‌లు భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి ప్రసాదంగా వితరణ చేశారు. చంటి పిల్లలకు పాలు మేకల వెంకన్నబాబు ఉచితంగా పంపిణీ చేశారు.

వినాయకునికి సహస్ర నారికేళ జలాభిషేకం

కాట్రేనికోన, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా కాట్రేనికోన మావుళ్ళమ్మ ఆలయ ప్రాంగణంలోని శ్రీసిద్దివినాయకునికి ఆదివారం సహస్ర నారికేళ జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆణివిళ్ళ సాయిబాబా, ప్రముఖ వేదపండితులు ఆకొండి శంకరశాస్త్రి, రామకృష్ణపరమహంస, గ్రంధి రామ్‌ప్రసాద్, ఆకొండి శేషు, ఆణివిళ్ళ పవన్‌కుమార్, బాలశ్రీనివాస్, తాతపూడి గోపి, సంసాని పాండురంగారావు, దొమ్మేటి ఫణీంద్ర, ర్యాలి భద్రి పాల్గొన్నారు. గెద్దనపల్లి పంచాయతీ చింతలమెరకలో శ్రీవిజయలక్ష్మీదుర్గాదేవికి శాకంబరి అలంకరణ జరిగింది. కార్యక్రమంలో కముజు లక్ష్మీరమణారావు దంపతులు, సంసాని అర్జున్, సంసాని లక్ష్మణరావు, బొక్కా జగదీష్, బైరిశెట్టి సురేష్, కట్టా సత్తిబాబు, సంసాని నాగరాజు, శీలం వేణు, మహిళలు పాల్గొని పూజలు చేశారు. పురోహితుడు ఆకొండి శ్రీకాంత్‌శర్మ ఆషాఢం విశిష్టతను వివరించారు.

వేంకటేశ్వరునికి ఏకాదశి పూజలు

అల్లవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): బంగారు తిరుపతిగా పేరొందిన బెండమూర్లంక లక్ష్మీవెంకటేశ్వరాలయంలో ఆషాఢం తొలి ఏకాదశి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. గుండెపూడి, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో కేశవస్వామి, జనార్ధనస్వామి ఆలయాల్లో, పలు రామాలయాల్లో పూజలు జరిగాయి. బెండమూర్లంక ఆలయంలో ఆలయ ప్రతినిధి, సినీనటుడు గుర్రం రామకృష్ణ, ఆలయ ధర్మకర్త కంచర్ల శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి: ఎమ్మెల్యే ఆనందరావు


ఉప్పలగుప్తం: సరిపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు


ముమ్మిడివరం: కొత్తలంకలో రైతుమిత్ర గ్రూపు సభ్యులకు డ్రోన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు


అంతర్వేది: మోరిలో సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖరం

ఉప్పలగుప్తం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం సరిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గెద్దం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, నీటిసంఘం చైర్మన్ ఆకుల వెంకటరమణ, పార్టీ కార్యదర్శి పందు వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు గుత్తుల నాగేశ్వరరావు, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, దంగేటి రవీంద్రనాద్, చీకట్ల ఏసు, రవణం మధు, మల్లాడి వెంకటరమణ, లంకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాలనలో పారదర్శకతకు తొలి అడుగు

అమలాపురం రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పాలనలో మరింత పారదర్శకతకు చంద్రబాబు ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఆదివారం నడిపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే ఆనందరావును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గ్రామస్తులకు కరపత్రాలు అందిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొలంగి సత్యసాయిబాబా, మాజీ ఎంపీపీ యెరుబండి వెంకటేశ్వరరావు, నాయకులు రాజులపూడి భీముడు, చింతా శంకరమూర్తి, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, మాడా మాధవి, దేవరపల్లి వీరేష్‌కుమార్, మంద గద్దయ్య, మల్లుల పోలయ్య, గోసంగి శ్రీనివాసరావు, కడియం సత్యనారాయణ పాల్గొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలన' కార్యక్రమాలు

సూపర్-6 పథకాల అమలు

మలికిపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. మలికిపురంలో ఆయన మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి అనూహ్యమైన స్పందన వస్తుందన్నారు. సూపర్-6 పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం ముందుందన్నారు. సమావేశంలో చాగంటి స్వామి, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

అంతర్వేది, జూలై6(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. మోరి, కేశవదాసుపాలెం గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ముప్పర్తి నాని, చాగంటి స్వామి, యెనుముల శ్రీధర్, యెనుముల సత్యనారాయణ, యెనుముల సింహాచలం, యెనుముల రమణ, బెల్లంకొండ సత్యనారాయణ, కడలి వెంకటరత్నం, తాడి సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం

ముమ్మిడివరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఆదివారం చినకొత్తలంక, కొత్తలంక గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలుచేసిన సంక్షేమ అభివృద్ధి పనులను వివరించారు. సమస్యలు అడిగి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వ్యవసాయ యాంత్రీకీకరణలో భాగంగా కొత్తలంకలో రమాసత్యనారాయణస్వామి కిసాన్ డ్రోన్ రైతు మిత్ర సంఘానికి 80శాతం రాయితీపై రూ.9.80లక్షల విలువగల డ్రోన్‌ను రూ.7.84లక్షల సబ్సిడీతో రూ.1.96లక్షలకు అందజేశారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాస్, చిక్కాల అంజిబాబు, వీపూరి వెంకటనాగరాజువర్మ, పొత్తూరి మల్లికార్జునవర్మ, తోలేటి రాంబాబు, గీసాల దుర్గాచంద్రరావు, దూడల స్వామి, దంగేటి శ్రీను, దాసరి గంగాధరరావు, బీరశివ, నడింపల్లి శ్రీనివాసరాజు, చైతన్యవర్మ, వంగా బాబులు, వీపూరి నాగరాజువర్మ, మట్టా గోవిందు, దూడల స్వామి, కోర్ల కామేశ్వరరావు, దువ్వూరి రాంబాబు, దాసరి సుమలత, వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్, రైతు సేవా కేంద్రం సహాయకుడు బొమ్మి బాబాయ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు



అమలాపురం ఏరియా పశువైద్యశాల వద్ద రేబిస్ వ్యాక్సిన్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం ఏరియా పశువైద్యశాల ఆవరణలో ఆదివారం సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోటిక్ వ్యాధులు ప్రాణాంతకమైనవని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు మాట్లాడుతూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా టీకాలు వేయించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. తొలిరోజు 280కుక్కలకు టీకాలు వేశామని, ఈనెల7,8 తేదీల్లో మిగిలిన కుక్కలకు టీకాలు వేసేవిధంగా ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ప్రజా విరాళంతో నిర్మించిన పశువుల షెడ్డును ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. రైతులకు 50శాతం రాయితీపై రెండు టన్నుల పశువుల దాణాను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, పశువైద్యులు డాక్టర్ నారాయణరావు, డాక్టర్ కావ్య, డాక్టర్ మాధురి, డాక్టర్ హెబ్సిబా, డాక్టర్ వాసవి, పశువైద్య సిబ్బంది వెంకటేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న రాచపల్లి దుర్గాప్రసాద్, బి.పాండురంగారావులకు రూ.10వేలు చొప్పున అందించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

అమలాపురంటౌన్, జూలై6(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అమలాపురం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శ్రీస్వామివివేకానంద యోగాశ్రమం గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీక్లబ్ హాలులో యోగా పోటీలు నిర్వహించారు. ఇంటర్నేషనల్ యోగా జడ్జి కేఎస్వీ శ్రీధర్ సాంకేతిక సహకారంతో పది నుంచి 80ఏళ్ల వయసున్న వారికి వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎ.కాత్యాయని, పి.చిరంజీవి, కె.తన్మశ్రీ, ఇ.ప్రవీణ్, ఎ.ఉషశ్రీ, డి.వెంకటేశ్వర్లు, వింజమూరి మాధవరావు విజేతలుగా నిలిచారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200మంది ఈపోటీల్లో పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజేతలకు పతకాలు, నగదు పారితోషకం సర్టిఫికెట్లను క్లబ్ అధ్యక్షుడు ఆర్డీఎస్ ప్రసాద్, కార్యదర్శి ఆకొండి పవన్, కోశాధికారి కూచిమంచి శశిధర్‌శ్రీరామ్‌లు అందజేశారు. వరదా మల్లిబాబు, కంకటాల వెంకటేశ్వరరావు, అప్పన వీరన్న పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

అమలాపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా శాఖ కార్యాలయం వద్ద ఆదివారం జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పూలమాలలువేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. మేరా యువ భారత్ కార్యక్రమాన్ని అమలాపురం ఏఎస్ఎన్ మహిళా కళాశాలలో నిర్వహించారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ జిల్లా కన్వీనర్ యిళ్ల సత్యనారాయణ పూలమాలలువేసి నివాళులర్పించి ఆయన త్యాగాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీహెచ్ఎన్ కిశోర్, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, అరుణ, కొండేటి ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాదయాత్రగా బాలబాలాజీ సన్నిధికి

మామిడికుదురు, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు మామిడికుదురు నుంచి అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధికి పాదయాత్ర నిర్వహించారు. మామిడికుదురు శివాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమై అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం వరకు గోవింద నామస్మరణల మధ్య సాగింది. బాలబాలాజీని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడం విశేషం.

సీఏ ఆల్ఇండియాలో నాగసాయిలక్ష్మణ్‌కు 15వ ర్యాంకు



అమలాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): సీఏ ఇంటర్మీడియట్‌లో అమలాపురానికి చెందిన నాగసాయి లక్ష్మణ్ ఆల్ఇండియా 15వ ర్యాంకు సాధించాడు. మే నెలలో రాసిన పరీక్షలకు ఆదివారం ది ఇండియా ఆఫ్ చార్టెర్డ్ ఎక్కౌంట్స్ ఆఫ్ఇండియా ఇంటర్మీయట్ ఫలితాలను వెలువరించింది. గుంటూరు మాస్టర్ మైండ్స్ కళాశాలలో చదువుతోన్న నాగసాయి లక్ష్మణ్‌ను తండ్రి డిప్యూటీ స్టాటికల్ అధికారి ప్రభాకరరావు, తల్లి ఉపాధ్యా యురాలు దుర్గాదేవితో పాటు బంధువులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందనలు తెలిపారు. సీఏ ఫైనల్స్‌లో కూడా మంచి ర్యాంకును సాధిస్తానని నాగసాయిలక్ష్మణ్ అభిప్రాయపడ్డారు.

ఆషుర్ ఖానాలకు రూ.5వేలు చొప్పున పంపిణీ

అమలాపురం రూరల్, జూలై6(ఆంధ్రజ్యోతి):మొహర్రం సంతాప దినాల్లో భాగంగా జిల్లాలో తొలిసారిగా 60ఆషుర్ ఖానాలకు రూ.5వేలు చొప్పున రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ నిధులు కేటాయించినట్టు వక్ఫ్ బోర్డు సభ్యుడు మాజీ ముఖ్రం హుస్సేన్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అమలాపురం, అల్లవరం మండలాల్లోని షియా ముస్లిం, ఆషుర్ ఖానాలకు రూ.5వేలు చొప్పున ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పంపిణీ చేశారు. మహ్మద్ బషీర్, హుస్సేన్, రాజా, లియాఖత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్రగాయాలు

అంబాజీపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్రగాయాలయ్యాయి.అంబాజీపేట కొర్లపాటివారిపాలానికి చెందిన మిందుగుదిటి పవిత్రధనలక్ష్మి, సోదరి సాయిచంద్రలేఖ, సోదరుడు సిద్ధివినయ్ శనివారం అమలాపురం మోటారుసైకిల్‌పై వెళ్తున్నారు. పేర్రాయిపాలెం రోడ్డు నుంచి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఒక వ్యక్తి ఆ ముగ్గురు వెళ్లే వాహనాన్ని ఢీకొట్టడంతో పవిత్రధనలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను కాకినాడ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ సాయిచంద్రలేఖ, సిద్ధివినాయకలను కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు తాటాకిళ్లు దగ్ధం: రూ.6లక్షల ఆస్తి నష్టం



అమలాపురం రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కామనగరువు జంగంపాలెంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకిళ్లు దగ్ధం కాగా నాలుగు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. రూ.6లక్షలు ఆస్తి నష్టం ఏర్పడింది. అమలాపురం అగ్నిమాపక అధికారి ఎం.రాజా తెలిపిన వివరాల ప్రకారం జంగంపాలెంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈప్రమాదంలో కుంచే శాంతామణి, కుంచే వెంకటేశ్వరరావులకు చెందిన తాటాకిళ్లతో పాటు తల్లీ కూతుళ్ల కుటుంబాలు నివాసం ఉంటున్న వాసంశెట్టి మంగతాయారు, దొంగ నాగలక్ష్మిల ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. వీరి ఇళ్లను ఆనుకుని బొక్కా నరసింహారావుకు చెందిన కొబ్బరి తోటకు మంటలు వ్యాపించడంతో 18 కొబ్బరిచెట్లు కాలిపోయాయి. ప్రమాదంలో రూ.6లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్నిమాపక అధికారి రాజా తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని స్థానికులతో కలిసి మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదం సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నక్కా చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యకర పంటలు

అంబాజీపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకర పంటలు పండించవచ్చని సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి అన్నారు. ముక్కామలలో సేంద్రియ వ్యవసాయం ద్వారా పొలంలోని రెండు ఎకరాల్లో పండించిన బూడిద గుమ్మడికాయలు 6టన్నులు దిగుబడి వచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. బండారు మల్లిబాబు, బొక్కా శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఎంటీ జనుపల్లి నాగవేణి తెలిపారు. మాస్టర్ ట్రైనర్ నాగమణి, దుర్గా, సత్యశ్యామల లక్ష్మి, దుర్గాభవాని, సత్యవాణి, మణి, మల్లేశ్వరి, కనకలక్ష్మి పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామకృష్ణ

అల్లవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా దేవగుప్తం గ్రామానికి చెందిన చింతా రామకృష్ణను నియమించారు. ఈసందర్భంగా రామకృష్ణను సర్పంచ్ సాధనాల వెంకట్రావు, జంగా వెంకటేష్, చిట్టూరి వెంకటనారాయణ, కుడుపూడి సూర్యప్రకాష్, సాధనాల శ్రీను, పోతుమూడి శ్రీను తదితరులు అభినందించారు.

వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జానకిరామయ్య



ముమ్మిడివరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): క్రాపచింతలపూడి గ్రామానికి చెందిన జానకీరామయ్య వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ పొన్నాడ సతీష్‌కుమార్‌కు, నియోజకవర్గంలోని పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశానానికి దారి లేక నరకయాతన


ఎర్రగరువులో శవాన్ని బురదలో నుంచి మోసుకెళ్తున్న దృశ్యం

ఐ.పోలవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎర్రగరువు భీమ్‌నగర్‌కు చెందిన రేవు ధనకాసులు ఆదివారం మృతి చెందాడు. శ్మశానానికి దారిలేక బురదలో నుంచి పంట పొలాల మధ్యగా మృతదేహాన్ని శ్మశానానికి తరలించారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా శ్మశానానికి రహదారి వసతి కల్పించాలని కోరుతున్నారు.

ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి

అంబాజీపేట, జూలై6(ఆంధ్రజ్యోతి): మహాభారతంలో గురుభక్తిని చాటే ఒక గొప్ప ఔనత్యం కలిగిన వ్యక్తి ఏకలవ్యుడని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ఏకలవ్యుడి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆషాఢమాసం తొలి ఏకాదశి సందర్భంగా ఏకలవ్య ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి గోవింద్ ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, భారతి వాసు, బండారు సత్యనారాయణ, గాడా గణేష్, గాడా పండు, పోసుబాబు, సురేష్, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, పి.కె.రావు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యుడి జయంతి

అమలాపురం రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): బండారులంకలో ఆదివారం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు బళ్ల వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతి నిర్వహించారు. ఏకలవ్యుని చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఎస్టీ నాయకులు బండారు శ్రీను, గాడ పోసిబాబు, మానుపాటి కుమార్, గాడా ర మేష్, గాడా పెద్దిరాజుతో పాటు కొండా శ్రీను, కాశిన బాబి, యాళ్ల కుమార్, బండారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం

పి.గన్నవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): గురుభక్తి కలిగిన ఏకలవ్యుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఏకలవ్యుడు జయంతి సందర్భంగా పి.గన్నవరం అక్విడెక్టు వద్ద యువత, సంఘాల ప్రతినిధులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏకలవ్యుడి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ఏకలవ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో గ్రామస్తుల రోడ్డు నిర్మాణం

ముమ్మిడివరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 1వ వార్డు రాజుపాలెంలో రోడ్డు అధ్వానంగా మారడంతో చినుకు పడితే చాలు రోడ్డుపై నీరు నిలబడటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. దీనిపై నగర పంచాయతీ కమిషనర్, చైర్మన్, కౌన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆ గ్రామంలోని యువకులు రూ.25వేలతో వంద మీటర్ల రోడ్డును సొంత ఖర్చులతో ఆధునికీకరింప చేసుకున్నారు.

ముమ్మిడివరంలో భక్తిశ్రద్ధలతో షహదత్

ముమ్మిడివరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఆస్తానయే బీబీ జైనబీయా పీర్ల పంజా వద్ద షియా ముస్లింలు షహదత్‌ను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం నెల ప్రారంభం నుంచి నల్ల దుస్తులు ధరించి బాధాతప్త హృదయాలతో మజ్లిస్ ఆలపిస్తూ రక్తం చిందేలా గుండెలు బాదుకుంటూ ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు మాతం నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. నగరానికి చెందిన మత గురువు మౌలానా అక్బర్‌షా పాల్గొని మాట్లాడారు. ఇమామ్ హుస్సేన్ కుటుంబంపై కర్బలాలో యజీద్ సైన్యం జరిపిన మారణకాండను భక్తులకు వివరించారు. తొలుత హజ్రత్అబ్బాస్ పీర్ల పంజా, సజ్జాదియా అలీఅస్గర్, షాహేదోషాహద, బైతుల్‌ఖాయం పీర్ల పంజా వద్ద పది రోజుల క్రితం మజ్లిస్‌ను నిర్వహించారు అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.


నిండు శోకంతో ముగిసిన మొహర్రం

కాట్రేనికోన, జూలై 6(ఆంధ్రజ్యోతి): మొహర్రం ప్రార్థనలు ఆదివారం ముగిశాయి. చెయ్యేరు అలీనగర్లో పీర్లపంజాలో ఆదివారం పీర్లను ప్రత్యేక మజిలీస్ల అనంతరం సాయంత్రం అవనతం చేశారు. అలీనగర్ గ్రామస్తులు ఉపాధి నిమిత్తం దేశ, విదేశాల్లో ఉంటూ మొహరం సందర్భంగా పది రోజులు మాత్రం స్వగ్రామంలోనే ఉన్నారు.

పీర్ల పంజాలో పవిత్రపీరుకు పూజలు

అల్లవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): హిందువులు-ముస్లింల సమైక్యతకు ప్రతీకగా అల్లవరం పీర్ల పంజా ప్రసిద్ధి పొందిందని ముజావర్లి షేక్ గౌసియా అన్నారు. ఆదివారం అల్లవరం పీర్ల పంజాలో శనగల పండుగ సందర్భంగా భక్తులు పోటెత్తారు. హిందువులు, ముస్లింలు పవిత్ర పీరు వద్ద పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి


గంగయ్యనాయుడు

మామిడికుదురు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెదపట్నం లంక సొసైటీ మాజీ అధ్యక్షుడు పినిశెట్టి గంగయ్యనాయుడు(92) అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించారు. ఆయన అంత్యక్రియలను సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తొలి ఏకాదశి పూజలు

ఐ.పోలవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆదివారం తొలి ఏకాదశి పూజలు మండల వ్యాప్తంగా నిర్వహించారు. మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

మండపేట




వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న దృశ్యం. పక్క చిత్రంలో విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు స్వామివారికి పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక రోజు ఆదాయం రూ.13.25 లక్షలు వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి యానానికి చెందిన సలాది శ్రీనివాస్, సత్యవతి దంపతులు రూ.50,116, వద్దిపర్రుకు చెందిన రావిపాటి గోవిందరావు, రత్నమాల దంపతులు రూ.30,001 విరాళం ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటం, శేష వస్త్రాలు అందజేశారు.

నూకాంబికా ఆలయ అభివృద్ధికి విరాళం

ఆలమూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆలమూరు సత్యలక్ష్మి రైస్‌మిల్లు అధినేత వెత్సా గవర్రాజు అండ్ పార్టనర్స్ రూ.1,00,116 విరాళం ఇచ్చారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గుర్తించి వారు విరాళం అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు పార్టనర్స్ వెత్సా గవర్రాజు, సూరిబాబు, రాము, నెప్రశా, సూర్యగుప్త, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షుడు చైట్ల గంగరాజు, గన్ని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయానికి విరాళం ఇస్తున్న దాతలు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మండపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి) ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మికసంఘ నాయకులు పిలుపునిచ్చారు. మండపేటలో ఆదివారం వారు సమావేశం జరిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి సి.వేంకటేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.




రాయవరం మండలం సోమేశ్వరంలో అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల. పక్క చిత్రంలో మండపేట మండలం ఏడిదలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు



కె.గంగవరం మండలం కోటిపల్లిలో ఇంటింట ప్రచారంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

కూటమి పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

• సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వేగుళ్ల • ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల వెల్లడి

రాయవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలోనే పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిపించడం ద్వారా ప్రజలు సుభిక్షంగా ఉన్నారని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ హరీష్ మాట్లాడుతూ త్వరలో అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నెరవేరుస్తున్నారని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారన్నారు. తొలుత సోమేశ్వరంలో శైవక్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామిని ఎంపీ, ఎమ్మెల్యే దర్శించుకున్నారు. గ్రామంలో ఇంటింటికి పర్యటించి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. సాయంత్రం మాచవరం గ్రామంలో ఎమ్మెల్యే వేగుళ్ల తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే వేగుళ్ల, ఎంపీ హరీష్ తదితరులను స్థానిక సామాజిక భవనం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, టీడీపీ నాయకులు శాకా శ్రీనివాస్, రావుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మాచవరంలో జరిగిన కార్యక్రమంలో మేడపాటి రవీంద్రారెడ్డి, కొవ్వూరి ఆదిరెడ్డి తదితరులతో పాటు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో సూపర్ సిక్స్ అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం ఏడిదలో ఆదివారం సుపరిపాలనపై జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో వున్న ఎన్‌టీఆర్ విగ్రహానికి నేతలు నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటా పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వారు తెలిపారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమలు చేయటంతోపాటు అర్హత కలిగిన మహిళలకు ప్రభుత్వం ఆర్థికసాయం రూ.1500 అందిస్తుందన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలపై వారు ధ్వజమెత్తారు, ప్రజల సమస్యలను వారు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వారి వెంట గ్రంథాలయ మాజీ ఛైర్మన్ వీర్రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పర్వతీన వీర్రాజు, మేకా జేజీబాబు, గోడవర్తి సత్యనారాయణ, చిట్టూరి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ పెన్మెత్స రమేష్‌రాజు, కోలు పోటిబాబు, గొడవర్తి శేషు, రామిశెట్టి రాజా, చిట్టూరి ప్రసాద్, ముగ్గళ్ల కాశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెలుగుదేశం పార్టీ మండల ప్రచార కార్యదర్శి చిల్లే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కోటిపల్లి గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

రావులపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశిని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. రావులపాలెం మండలంలో తొలిఏకాదశి సందర్భంగా ఆయా ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించడంతో పాటు వెండి కవచ అలంకరణ జరిపి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, లొల్ల, సోమేశ్వరం, పసలపూడి, చెల్లూరు, వి.సావరం గ్రామాల్లో వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశి సందర్భంగా ఆలమూరులోని వైష్ణవ ఆలయాలు కిటకిటలాడాయి అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలమూరు నవజనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో గోపూజ చేశారు. ఆలమూరు కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతలూరు, గుమ్మిలేరు, చొప్పెల్ల, నర్సిపూడి, మోదుకూరు తదితర గ్రామాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తొలిఏకాదశి పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తొలిఏకాదశి సందర్భంగా భజనలు చేశారు

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కాలేరు, వెదురుమూడి, వల్లూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరి పారు. గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.




రావులపాలెంలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ. పక్క చిత్రంలో రాయవరంలో వెండి కవచం అలంకరణలో విజయదుర్గా అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో ఆలమూరు నవజనార్దస్వామి



భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం తీసుకుంటున్న గోవిందరావు దంపతులు

భీమేశ్వరాలయంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అదనపు కమిషనర్ పూజలు

ద్రాక్షారామ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఆదివారం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అదనపు కమిషనర్ ఆర్.గోవిందరావు కుటుంబ సమేతంగా సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనం అనంతరం నంది మండపంలో వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.



మాట్లాడుతున్న కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు

త్వరలో వైఎస్ షర్మిల పాదయాత్ర

కాంగ్రెస్‌పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన

మండపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు తాను చేసిన పర్యటన విజయవంతం అయిందని కాంగ్రెస్‌పార్టీ కిసాన్‌సెల్ విభాగం అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. మండపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాష్ట్రంలో పాదయాత్ర చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్లిన వారంతా తిరిగి పార్టీలో చేరాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు కొడవలి వెంకటసుబ్బారావు, ముగళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులు

ఆత్రేయపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లిలో ఆదివారం డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మిడిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలాబత్తుల చిన్నారి, అల్లు భాస్కరరావు, చేకూరి రమేష్‌వర్మ, పడాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టీఎస్‌ఆర్ ఆంజనేయులు, గొలకోటి వెంకటేశ్వరరావు, అన్యం సత్యనారాయణ, సలాది లక్ష్మణరావు, బి.లక్ష్మణరావు, కె.శివ, బి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శోకతప్త హృదయాలతో మొహర్రం

ద్రాక్షారామ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో ఆదివారం మొహర్రం కార్యక్రమాన్ని ముస్లింలు నిండుశోకంతో జరుపుకున్నారు. పెద్ద మసీదు సెంటర్ నుంచి హజరత్ అబ్బాస్ రోడ్డు వరకు అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మాతం జరిపారు. చెరువు వద్దకు పీరులను తీసుకువెళ్లి కడిగి శాంతింపచేశా రు. లఖ్నవ్(ఫైజాబాద్) నుంచి వచ్చిన అలీ మొహమ్మద్ షంసీ మజ్లీస్ బోధించారు. శనివారం రాత్రి తల్లి పీరు ఊరేగింపు ప్రధాన ఘట్టంగా జరిగింది. అంజుమన్ సంఘాలు, ఇతర రాష్ట్రాలు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారికి అన్ని ఏర్పాట్లు చేశారు.



ద్రాక్షారామలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

మండపేట, (ఆంధ్రజ్యోతి): మొహరం సంతాప దినాల కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఆదివారం స్థానిక జామియా మసీదులో ప్రార్థనలు జరిగాయి. మసీదు ఇమామ్ గులాంమొహ్మద్ ముర్షిరజ్వీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో మొహర్రం కార్యక్రమాన్ని ఆదివారం జరుపుకున్నారు. అంగర మస్జిద్ - ఎ - ఇబ్రహీమ మసీదులో నిర్వహించిన కార్యక్రమంలో మసీదు ముతవల్లీ మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో మసీద్ ఇమామ్ మౌలానా మహ్మద్ నాజీం అక్తర్ మొహర్రం ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని పురస్కరించుకుని శోకతప్త హృదయాలతో జరుపుకునే మొహర్రం నిర్వహించారు. హజ్రత్ ఇమాం హుస్సేన్ గుర్తుగా గ్రామంలో పంజా (పీర్లను) ఊరేగించారు. శనివారం రాత్రి గ్రామంలో ప్రధాన రహదారి వద్ద ముస్లింలు నిప్పుల గుండం తొక్కారు.



శాకాంబరి అలంకరణలో వెదురుపాక సత్తెమ్మ అమ్మవారు

శాకాంబరిగా సత్తెమ్మ అమ్మవారు

రాయవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక-అరికరేవుల రోడ్డులో ఉన్న సత్తెమ్మ అమ్మవారు ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాచవరపు వెంకట సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వి.సావరం గ్రామానికి కూరగాయాల వ్యాపారి కాకి శ్రీను కుమారుడు వెంకట సత్యసాయి మణికంఠ వితరణతో వివిధ రకాల కూరగాయలు ఉపయోగించి సత్తెమ్మ అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించారు. పుట్టకొండ గ్రామానికి చెందిన విజయదుర్గా శక్తిపీఠం గురువు దంగేటి త్రిమూర్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, హారతులు నిర్వహించారు. కార్యక్రమంలో మాచవరపు సత్యనారాయణ, లక్ష్మి దంపతులు, వెదురుపాక, వి.సావరం, మెళ్లూరు తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

కె.గంగవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకుని, ఆయన స్ఫూర్తితో అభివృద్ధి పథంలో నడవాలని ఏపీ ఎరుకల ఏకలవ్య యూత్ సంఘం అధ్యక్షుడు బి.గోవిందు అన్నారు. ఏకలవ్యుడి జయంతిని పామర్రు ఉన్నత పాఠశాల ఆటస్థలంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.రాజు, ఏ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరంలో ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏకలవ్యుడి జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నేతలు ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు సంఘం నేతలు మాట్లాడారు. అనంతరం ఏకలవ్య ఎరుకల సంఘం నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు గాడా పట్టాభి రామయ్య, మనుపాటి గోవిందు తదితరులతో పాటు అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కె.గంగవరంలో ఏకలవ్యుడి జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేస్తున్న నాయకులు



సమ్మె కరపత్రాలను ఆవిష్కరించిన పంచాయతీ పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

కొత్తపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు జీవో 101 ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, పనిభారాన్ని పెంచే కేంద్ర నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా వ్యతిరేకించాలని ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఆర్.రాఘవులు, రేవు తిరపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులతో సమావేశమై వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణమూర్తి, నాగాబత్తుల రవి కుమార్, కొమ్మర ఆనంద్, ప్రసాద్, లంకా రమేష్, ఖండవిల్లి రాజబాబు, బంగారు మధు తదితరులు పాల్గొన్నారు.



పశువైద్యశాలలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ అనిత

జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): జంతువుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత సూచించారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద పెంపుడు కుక్కలను వ్యాక్సిన్ వేశారు. జంతుల పట్ల అవగాహనతో ఉండాలని వాటికి ఎప్పటికప్పుడు వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఆలమూరు మండలంలో అన్ని పశువైద్య శాలలలోను ఉచితంగా కుక్కలకు వ్యాక్సిన్ అందించే కార్యక్రమం చేపట్టామని ప్రజలు దీన్ని గుర్తించి వ్యాక్సిన్ చేయించుకోవాలని డాక్టర్ అనిత సూచించారు.

కోటిపల్లి, గంగవరంలలో జూనోసిస్ డే

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని కోటిపల్లి పశువైద్యశాల వద్ద ఆదివారం పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయా ఆసుపత్రుల వద్ద జరిగిన కార్యక్రమాల్లో పశు వైద్యురాలు సంయుక్తలక్ష్మి మాట్లాడుతూ ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే జరుపుకోవడానికి గల కారణాలు వివరించారు. పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా ఆసుపత్రుల వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పాకాకు జొన్నాడలో సత్కారం

ఆలమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణను జొన్నాడలో ఆదివారం బీసీ సంఘం అధ్వర్యంలో సత్కరించారు. రాజమహేంద్రవరంలో జరిగిన బీజేపీ సమావేశానికి హాజరై తిరిగి భీమవరం వెళుతుండగా జొన్నాడ వద్ద బీసీ సంఘ నాయకులు స్వాగతం పలికి స్థానిక బీసీ కమ్యూనిటీ హాలులో సత్కరించారు. ముందుగా జ్యోతిరావ్‌ఫూలే విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అయినవిల్లి సత్తిబాబు, తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి బాబీ, వాకా గోవిందరాజు, మట్ట వీరబాబు గౌడ్, ఎం.కృష్ణారెడ్డి, వి.గోపాలకృష్ణ, కట్టా ప్రసాద్, వీరి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



జొన్నాడ వద్ద రాజ్యసభ సభ్యుడు పాకాను సత్కరిస్తున్న దృశ్యం



ద్వారపూడిలో శాకాంబరిదేవిగా వాసవీమాత

శాకాంబరిదేవిగా వాసవీమాత అలంకరణ

మండపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడిలో ఉన్న వాసవీ మాత అమ్మవారు ఆదివారం ఆషాడమాసాన్ని పురస్కరించుకుని కూరగాయాలతో అలంకరించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

మండపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశి సందర్భంగా మండపేటనున్న శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తుల స్వామివారి దర్శనానికి పోటెత్తారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

అంబాజీపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలయ్యాయి. అంబాజీపేట కొర్లపాటివారిపాలానికి చెందిన ఎం.పవిత్రధనలక్ష్మి, సోదరి సాయిచంద్రలేఖ, సోదరుడు సిద్ధివినయ్ శనివారం అమలాపురం మోటారుసైకిల్‌పై వెళ్తున్నారు. పేర్రాయిపాలెం రోడ్డు నుంచి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఒక వ్యక్తి వారి వాహనాన్ని ఢీకొట్టడంతో పవిత్రధనలక్ష్మికి గాయాలయ్యాయి. ఆమెను కాకినాడ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ సాయిచంద్రలేఖ, సిద్ధివినాయకలను కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఆలమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కో దాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెం దిన ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ కుటుంబాలకు పోలీస్ సిబ్బంది ఆర్థిక సాయం అందిం చారు. 2009 ఎస్‌ఐల బ్యాచ్‌కు చెందిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వెల్ఫేర్ ఫండ్ నుంచి అశోక్ కుటుంబ సభ్యులకు రూ.26లక్షల ఆర్థికసాయాన్ని నరసాపురంలోని ఆయన స్వగృహంలో అందజేశారు. ముందుగా దివంగతులైన ఎస్‌ఐ అశోక్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆలమూరులో కానిస్టేబుల్ బ్లెసన్ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 2009 ఎస్‌ఐల బ్యాచ్‌కు చెందిన పలువురు పాల్గొన్నారు.



ఎస్‌ఐ అశోక్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న పోలీస్ సిబ్బంది